# భయం

పి. గణపతి శాస్త్రి

సాల్ట్ డిపార్టుమెంటులో లోవర్ డివిజన్ క్లర్కుగా కాకినాడలో పని చేస్తున్న సూర్యారావుకి తలవని తలంపుగా ఒక ప్రమోషన్ ఇచ్చి నౌపడా గ్రామానికి బదిలీ చేసారు. అతనికి ఇద్దరు పిల్లలు. వారిలో మొదటిది ఆడపిల్ల. రెండవవాడు మగపిల్లవాడు. పసివాడికి ఇంకా నాలుగు ఏళ్ళు నిండలేదు.

ఆ పరిస్థితిలో పిల్లతో పాటు భార్య ఇందిరను పుట్టింటనే అట్టే పెట్టి తాను ఒక్కడే నౌపడా వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు సూర్యారావు. కాని భార్య దానికి బొత్తిగా ఒప్పుకోలేదు. కంట నీరు పెట్టుకుని పిల్లలతో పాటు తాను కూడ నౌపడాకు బయలుదేరతానని భీష్మించుకుని కూర్చున్నది.

దానిమీద సూర్యారావు దానికి తన అభ్యంతరం చెప్పాడు.

"నౌపడా అంటే నీకింకా తెలియడంలేదు. అది ఒక చిట్టడివిలాంటి గ్రామం. అధమం ఒక కిలో మీటరు దూరం దాకా ఎక్కడా ఒక్క ఇల్లైనా కన్పించదు. ఆ ఇళ్ళైనా సాల్ట్ డిపార్టుమెంటు ఉద్యోగస్తులవి.

ఆపైన దొంగల భయం. దానిపైన పాముల భయం కూడా చాలా ఎక్కువ. ఎక్కడ చూచినా పాముల పుట్టలే. నీ వక్కడ అడుగు పెట్టగానే విపరీతమైన భయంవల్ల పై ప్రాణాలు పైనే ఎగిరిపోతాయి. నా మాట విని పుట్టింటిలో నే ఉండిపో." అయినా ఇందిర ఆ మాట తన చెవి కెక్కనీయలేదు.

సూర్యారావుకి ఇంకా ముప్ఫయ్యైదేళ్ళ ప్రాయం నిండలేదు. భార్య ఇందిర అతనికన్న పదేళ్ళు చిన్న. ఆమె కొంత అందగత్తెలలోనే లెక్క. పచ్చని శరీరచ్ఛాయతో, చక్రాలలాంటి కళ్ళతో, చక్కని చిక్కని చిరునవ్వుతో చూచిన వారి నిట్టే ఆకట్టుకోగలదు.

ఆమె తాను కూడ వెంట వస్తున్నానని పట్టుపట్టి రాగాలు మొదలు పెట్టినప్పుడు సూర్యారావు ఒక చిన్న ఛలోక్తి విసిరాడు.

"ఇందూ! నీవు కంట నీరు పెట్టుకుంటే మరింత అందంగా కన్పిస్తావు. ఆపైన కాటుక కూడ పెట్టుకుంటే చూడ రెండు కళ్ళు చాలవనిపిస్తుంది."

దానికి ఇందిర, "బాగానే ఉంది వరస. అందుకనే కాబోలు ఇటీవల తెల్లవారింది మొదలుకుని సాయంత్రం దాకా నన్నిలాగ ఏడుపించుకుని తింటున్నారు. ఏది ఏమయినా సరే నన్ను కూడా నౌపడా తీసుకు వెళ్ళవలసిందే."

ఇందిర కంట నీరు చూడగానే సూర్యారావు గుండె చెరువయింది. మరి కాదనలేక భార్యతోను, పిల్లలతోను కలిసి నౌపడాలో ఒక చిన్న గవర్నమెంట్ క్వార్టర్‌లో తన నివాస ప్రారంభించాడు. అలాగ ఒక నెల రోజులు గడిచేసరికి ఇందిర ఆ పరిస్థితులకు కొంచెం అలవాటు పడింది.

సామాన్యంగా ఆదివారం వచ్చిందంటే సాల్ట్ డిపార్టుమెంటు ఉద్యోగస్థులలో చాలా మంది నౌపడా గ్రామానికి ఏడెనిమిది కిలో మీటర్ల దూరంలో వున్న టెక్కలికి వెళ్ళి పోతూ వుంటారు. అక్కడ కావలసిన కొన్ని అత్యవసర వస్తువులు కొనుక్కుని సినిమా చూచి రాత్రి సుమారు పదకొండు గంటల ప్రాంతంలో ఇళ్ళకు చేరుకుంటూ ఉంటారు.

ఆవేళ సాయంత్రం కాగానే సూర్యారావు తన తోడి సాల్ట్ డిపార్టుమెంట్ ఉద్యోగస్తులతో కలిసి ఏదో సరికొత్త సినిమా చూచి రావడానికి టెక్కలి బయలు దేరాడు. ఇందిర కూడ బయలు దేరాలని అనుకున్నది కాని తాను ఒక్కతే పిల్లలతో కలిసి టెక్కలి వెళ్లాలి.

అంతేకాని తోడుగా మరి మిగిలిన ఆడవాళ్ళు ఎవళ్ళూ లేరు. అందుచేతనే సూర్యారావు ఇంకొకప్పుడు ఎప్పుడైనా భార్యను సినిమాకు తీసుకుని వెడతానన్నాడు. అంతేనే కాని మరి ప్రస్తుతానికి వీలు లేదన్నాడు.

అందుచేత మరి ఏమి అనడానికి ఇందిరకు పాలుపోలేదు. ఆలస్యం చేయకుండా వెంటనే తిరిగి రావలసిందని పిల్లలతో పాటు వీధిలో నిలుచున్నది.

ఇటీవల నలుగు రైదుగురు బందిపోటు దొంగలు ఒక పెద్ద ఉప్పు కాంట్రాక్టరు ఇంటిలో జొరబడి అతని గుండె మీద బాకు ఆనించి భూమిలో దాచుకున్న నగలు, నట్రలు అపహరించుకుని పోయారని విని మరింతగా గజగజ వణికిపోయింది.

అంతకు మునుపే ఆమె తన పరిస్థితులన్నీ తెలియచేస్తూ ఒంటరిగా నౌపడాలో వుండలేకపోతున్నానని ఒక ఉత్తరం తన పుట్టింటికి వ్రాసింది. కాని దానికి సమాధానమేమి రాలేదు. అందుచేత ఆమె కీనాడు మరింతగా దిగులు పట్టుకుంది.

శ్రీకాకుళం జిల్లా నౌపడా గ్రామం ఉప్పు పంటకు చాలా ప్రసిద్ధి కెక్కింది. హటాత్తుగా ఎవరికైన కొంచెం జబ్బు చేస్తే డాక్టర్లతో పాటు మందులు, మాకులు దొరకవు. వాటికోసం సమీపంలో వున్న టెక్కలి వెళ్ళి రావలసిందే. ఇంకా కాలక్షేపం కోసం ఏ సినిమాకో వెళ్లాలంటే టెక్కలి ఒక్కటే తప్ప వేరొక దిక్కు ఏదీ లేదు.

అది డిసెంబరు నెలాఖరు. అందువల్ల ఆ ప్రాంతంలో పొగ మంచు ప్రారంభమయింది. దానికితోడు చలి కూడ ఎక్కువయింది. ఇందిర బిక్కు బిక్కుమంటూ పిల్లలతో కలిసి లోపలికి వెళ్ళి విపరీతమైన భయంతో, ఆందోళనతో ప్రాణాలు అరచేత పట్టుకుని కూర్చున్నది.

అంతలోనే వీధి తలుపు ఎవరో తట్టినట్టు చప్పుడయింది. ఇందిర తలుపు దగ్గిరగా వెళ్ళింది. కాని ఆ చప్పుడు గాలి వీచినందువల్లే బయలు దేరిందని నిశ్చయించుకున్నది. ఆ సమయంలో గుడ్లగూబల కూతలు, నక్కల ఊళ్ళలు తప్ప మరేవి వినపడలేదు. ఇందిర కప్పుడు వెంటనే తిరిగి పుట్టింటికి వెళ్ళిపోవాలనిపించింది.

సినిమాకి వెళ్ళవద్దని తాను ఒక్కతెని ఉండలేనని ఇందిర ఎంతగా ప్రాధేయపడిన సూర్యారావు వినలేదు.

"ఇదిగో చూడు నువ్వు బి. ఏ. పాస్ అయ్యావు. ఈ రోజుల్లో స్త్రీలు అన్ని రంగాలలోను మగవారిని తలదన్నే ధైర్యంతో ముున్ముందు కురుకుతున్నారు. అంతేనేగాని బి. ఏ. పాస్ అయినా నీలాగ చీటికి మాటికి బెంబేలు పడడం లేదు. కాస్త ధైర్యంగా వుండడం అలవాటు చేసుకో. కొంచెం ధైర్యం చిక్కబట్టుకోగలిగితే ఆపదలన్ని వాటంతట అవే దూర దూరంగా పారిపోతాయి అని బుజ్జగించాడు"

కాని ఇందిరకు ఆ ఓదార్పు చెవి కెక్కలేదు. సూర్యారావును సాగనంపి ఇంటిలో అడుగు పెట్టింది. అంతలోనే ఎలక్ట్రిక్ దీపాలన్ని ఒక్కసారిగా గప్పుమని ఆరిపోయాయి. అవి మరి తెల్లవారేదాకా తిరిగి వెలగలేదు.

ఆ ప్రాంతంలో ఎలక్ట్రిక్ లైట్లు అకస్మాత్తుగా ఆరిపోయి ఎప్పుడో ఒకప్పుడు తిరిగి వెలుగుతాయి. లేకపోతే భళ్ళుమని తెల్లవారేదాకా కటిక చీకటిలో కాలక్షేపం చెయ్యవలసిందే. ఆపైన ఆ చీకటిలో పిల్లల ఏడ్పులు, రాగాలు ఆరంభమయ్యాయి.

ఇందిరకు ఆ సమయంలో అకస్మాత్తుగా ఇంటిలో ఎవరైన దూరినా దూరవచ్చుననిపించింది. ఆ గాభరాలో ఆమెకు గుండె ఆగిపోతున్నట్టనిపించింది. అయిన అతి కష్టంమీద గుండె చిక్క బట్టుకుని పిల్లలతో పాటు పడకటింటిలోకి వెళ్ళి పరుపుమీద మేను వాల్చింది.

అలాగ సుమారు పదకొండు గంటలయ్యేసరికి సూర్యారావు ఇంటికి తిరిగి వచ్చాడు. అతడు ఇంటిలోనికి రాగానే భార్య అతికష్టంమీద తడుముకుంటూ వెళ్ళి ఒక చిన్న టేబుల్ లైటు

వెలిగించింది.

ఆపైన అతనికేసి చూచి కుమిలి కుమిలి దుఃఖించడం ప్రారంభించింది. అప్పటికి పిల్లలిద్దరు బెంగటిల్లిపోయి నిద్రిస్తున్నారు.

"ఎందుకలాగ ఏడుస్తావు?" సూర్యారావు ఎంతో ఆప్యాయంగా బుజ్జగిస్తూ ఇందిరను అడిగాడు. గట్టిగా మాట్లాడవద్దని నోటికి అడ్డంగా పెట్టుకున్న చేతితో ఇందిర అతనికి సూచించింది. ఏం అని అతి రహస్యంగా నెమ్మదిగా అడిగాడు సూర్యారావు.

ఇందిర తన గొంతు బాగా తగ్గించి అతని చెవిలో ఊదింది.

"నన్ను ధైర్యంగా వుండమని సలహా ఇచ్చారు మీరు. నేను అలాగే గుండె చిక్కబట్టుకుని పిల్లలతో పాటు ఇంట్లో కూర్చున్నాను. అంతలో నే ఎవడో ఓరగా వేసిన తలుపు తెరుచుకుని తటాలున ఆ గదిలో దూరాడు. వాడెవడో నల్లని ముసుగు మనిషిలా వున్నాడు. పిల్లలతో పాటు మనం నిద్రపోగానే ఇంటిలో దాచుకున్న విలువైన సామానులు అన్ని చేత పట్టుకుని ఇట్టే వీధిలోకి ఉడాయించేలా వున్నాడు.

కాస్త ఆ గదిలోకి వెళ్ళి చూడండి "

ఆ మాటలు వినగానే గాభరావల్ల సూర్యారావుకి నోటమాట పెగల్లేదు. అంతలోనే రహస్యంగా ఇందిర అందుకున్నది.

"అదేమిటండీ అలాగ గాభరపడి కంగారుపడిపోతారు. కాస్త ఆ గదిలోకి వెళ్ళి చూడండి. కండలు తిరిగిన మీరే ఇలాగ భయపడిపోతే ఎలాగ!

సూర్యారావు దానికి ఏవిధంగాను బదులు చెప్పలేక ఆ పక్కనే వున్న గది దాకా వెళ్లాడు. అంతేగాని ఆ అదిలోకి అడుగుపెట్టడానికి కూడ అతనికి ధైర్యంచాలలేదు.

వెంటనే ఒక్క అంగలోనే భార్య దగ్గరకు పరిగెత్తుకునివచ్చి.

అవును నీవన్నట్లే ఎవడో ఒకడు ముసుగుపెట్టుకుని అక్కడ చిన్నబల్ల కింద నక్కి కూర్చునట్టున్నారు." ఆపైన అతనికి నోట మాట పెగల్లేదు. భరించలేని భయంతో ముచ్చెమటలు పోసాయి. అంతలోనే చటుక్కున వీధి తలుపు తెరిచి తన గొంతెత్తి దొంగ, దొంగ అని గట్టిగా అరిచాడు. ఆపైన అతనికి అంకిళ్ళు పడిపోయాయి.

వీధి అరుగు మీద చతికిలబడిపోయాడు. అదే సమయంలో ఇందిర అతని జబ్బ దొరక పుచ్చుకుని పైకి లేవనెత్తింది.

"మగమహారాజులు మీరే ఇలాగ చతికిలబడిపోతే ఎలాగ చెప్పండి. కాస్త మనం ఇద్దరం కలిసి ఆగది లోపలికి వెళ్ళి ఆ దొంగ ఎక్కడ నక్కి కూర్చున్నాడో చూద్దాం రండి. ఈ అరణ్యంలో ఎన్ని కేకలు పెట్టిన ప్రయోజనం లేదు. అంతా అరణ్య రోదనమే అవుతుంది. ఆపైన మీకు అంకిళ్ళు కూడా పడిపోయాయి. మరి ఏమి భయం లేదు లెండి. నేను ఉన్నాను లెండి. కాస్త ఆ గదిలోకి వెళ్ళి తొంగిచూడండి." అంటూ అతని జబ్బ దొరకపుచ్చుకుని గదిలోకి తీసుకుని వెళ్ళింది.

అదే సమయంలో ఇందిర సూర్యారావుని చూచి పట్టలేనినవ్వుతో పకపక నవ్వసాగింది. ఆ మరుక్షణంలోనే చిన్న గుర్రం సకిలింపు వంటి నవ్వు వినబడింది. ఆ శబ్దం వచ్చిన వేపు పరీక్షగా చూచి ఎవరిది? నీవా శ్రీనివాస్ అంటూ ప్రశ్నించాడు.

వెంటనే శ్రీనివాస్ తన ముసుగు తొలగించి కలకల నవ్వుతూ నిలుచున్నారు. అతడు చదువు సంధ్యల్లోనే కాక అల్లరి పనుల్లో కూడా బాగా ఆరితేరినవాడు. సూర్యారావు అతనికేసి చూసి నువ్వెప్పుడొచ్చావోయ్ అంటూ సమీపించాడు.

అదే సమయంలో శ్రీనివాస్ అందుకున్నాడు:

"ఈ మధ్య మీరు తనని ఒంటరిగా చేసి తరుచుగ సినిమాలకి వెళ్ళిపోతున్నారని అక్క వ్రాసింది.

ఆ సమయంలో ఇక్కడ ఉండలేక వెంటనే శ్రీకాకుళంలో మా యింటికి వచ్చేస్తున్నానని కూడా సూచించింది. ఆమె పరిస్థితి గమనించి నేనిక్కడికి వచ్చాను."

"అలాగా! నువ్వెప్పుడొచ్చావు" అని ఆత్రంగా ప్రశ్నించాడు సూర్యారావు:

"మీరు రావడానికి ఒక గంటముందే వచ్చాను. ఆపైన నేను, అక్క మీ ధైర్యసాహసాలు గమనించి ఉప్పొంగి పోయాము. మీరు మేరు సమానధీరులు బావగారూ!" అంటూ అదే పనిగా నవ్వనారంభించాడు

అదే క్షణంలో సూర్యారావు – "నేనింకెప్పుడు మీ అక్కని, పిల్లల్ని వెంట తీసుకుని పోకుండా ఒక్కడిని సినిమాకి వెళ్లనులే! ఇందిర మరి పుట్టింటికి వెళ్లవలసిన అవసరం లేదులే" అంటూ తన ఓటమి కప్పి పుచ్చుకోవడానికి ఇంచరితో కలిసి తాను కూడ నవ్వసాగాడు. □

